# 'కొటికెలపూడి పావురం'

ఈ వారం శీర్షిక చదివి, ఇదేదో 'కొటికెలపూడి' అన్న వంశం వాళ్లు పెంచుకుంటున్న పావురాల్లో  ఓ పావురం కథ అనుకునే ప్రమాదం ఉంది.

శ్రీశ్రీ ఎక్కడో ఓసారి మస్త్ మజాగా పార్టీ చేసుకుని కాసేపు పడుకుని, రాత్రి రెండుగంటలకి లేచి 'నాకు పావురం కావాలి' అని గోలపెట్టాడట.

ఇదేం తద్దినంరా బాబూ ఇంత రాత్రివేళ ఉచ్చులూ వలలూ తీసుకుని పావురాల వేట కెళ్లడం ఎలా? అని జనాలు తన్నుకు చస్తూంటే..

'హ్హా... హ్హా... హ్హా... పావురం అంటే పావు (1/4) రమ్ము... ఓ క్వార్టరు రమ్ముకాయి' అని శ్రీశ్రీ సెలవిచ్చాట్ట.

అదుగో అట్లాంటిదే యీ కొటికెలపూడి పావురం కథ కూడానూ...

తినే ప్రతివాడూ తిండిబోతు కానట్టే, తాగే ప్రతివాడూ తాగుబోతు కాడు. అది వ్యసనంగా  పరిణమించనంతవరకూ.

మిత్రులు కొటికెలపూడి లక్ష్మీనరసింహమూర్తిగారు కొద్దిగా పుచ్చుకుంటారు. కేవలం కుంఫిణీ కోసం అన్నమాట.

ప్రతి వ్యసనానికి తీవ్రమైన ఆకర్షణ ఉంటుంది. అది తన పరిధిలోకి వచ్చినవాళ్లని తనవైపు లాక్కోడానికి తీవ్ర ప్రయత్నం చేస్తుంది.నాలాంటి బలహీన మనస్కుల్ని అతి సులభంగా లాగేసుకుంటుంది.

మద్యం అన్నది ఎంత భయంకర వ్యసనమో శ్రీ చిన్మయానందగారు ప్రసంగిస్తూ ఓ పిట్టకథ చెప్పేవారు. స్వర్గనరకాల అస్తిత్వం పక్కనుంచి ఆ చిన్నకథ.

ఒకడు స్వర్గానికి కొన్ని మెట్లదూరంలో వున్నాడు. మెట్లెక్కుతున్నాడు. ఓ మెట్టు దగ్గర ఓ జూదగాడు కూచుని జూదానికి రమ్మని ఆహ్వానించాడు... స్వర్గానికెళుతున్న ఆసామి 'నో' అని ఇంకో మెట్టెక్కాడు. అక్కడా ఓ వ్యసనం. అదీ కాదనుకున్నాడు. యింకో మెట్టెక్కాడు అక్కడ అత్యంత సౌందర్యరాశి ఒకతె రమ్మని ఆహ్వానిస్తే ఆమెనూ తిరస్కరించాడు. మరో మెట్టు, మరో మెట్టు చిట్టచివరి మెట్టు వచ్చింది. అది దాటితే స్వర్గమే... అక్కడ ఆ చివరి మెట్టు మీద ఓ యువతి మధు పాత్రతో నుంచుని వుంది. ఆ మధుపాత్రని ముందుకు చాచి కాస్త దాహం తీర్చుకోమంది. 'ఆ౦దాహమే కదా' అనుకుని కొద్దిగా పుచ్చుకున్నాట్ట. యింకొద్దిగా

తాగాలన్పించింది... తాగాడు... మరో గుక్క అనుకొన్నాడు వేసుకున్నాడు. అట్లా కొద్దిగా కొద్దిగా అనుకుంటూ ఆ మధుభాండాన్ని ఖాళీ చేసాడు. చేసి, ఓసారి వెనక్కి తిరిగి చూశాడు. అంతే... మెట్టుమెట్టుగా దిగుతూ చివరికి ఏంకావాలో అదే అయ్యాడు.

పై చెప్పిన కథలో లాగా మూర్తిగారు పతనం కాలేదు కానీ, తను మొట్టమొదటిసారి మద్య వ్యసనానికి ఎలా ఆకర్షింపబడ్డారో తనే చెప్పారు.

మూర్తిగారు ఇప్పుడు సెంట్రల్ గవర్న్మెంటు ఉద్యోగిగా రిటైరయ్యారు. ఇది దాదాపు ముప్ఫై ఏళ్ళ చిల్లర క్రిందటి మాట. అందరికి మల్లేనే మూర్తిగారికి ఈ తాగే వాళ్లు ఎందుకు తాగుతారు.. అందులో ఏముంటుంది అన్న ధర్మ సందేహం కలిగింది. 'ఆఁ ఓ మాటు వేసుకు చూస్తే పోలా' అననుకున్నారు.

జనవరి ఒకటో తారీఖు. రాత్రి పదింటికి డ్యూటీ దిగారు. ఓ వైన్ స్టోరులో ఓ పావురం ఖరీదు చేసారు.. ఢిల్లీవాలా మిఠాయి భాండార్‌లో నేతి జీడిపప్పు కొన్నారు.

వచ్చి కూచుని మందు కొద్దిగా సేవించి ఓ రెండు జీడిపప్పు పలుకులు నోట్లో వేసుకున్నారు. ఏమీ అనిపించలా... మరి కాస్త ముందు... మరిన్ని జీడిపప్పు పలుకులూ మాయమయ్యాయి. ఓసోస్ యింతేనా... ఈ మాత్రం దానికి అందరూ ఎందుకలా పడిచస్తారో అనుకుంటూండగా... మందు తన ప్రభావం చూపించసాగింది. పెదవులు మొద్దుబారాయి. కాళ్లూ ఊగసాగాయి. క్రమక్రమేణా ఒళ్లంతా వ్యాపించింది. దాంతర్వాత ఏదేదో ఆయనతో వాగించింది ఆ మందు. దాంతర్వాత స్పృహ లేకుండా నిద్రపోయేట్టు చేసింది. మూర్తిగారే కాదు చాలామందికి అలవాటు ఇలాగే అవుతుంది. దాంతర్వాత ఇల్లూ వళ్లూ గుల్ల చేస్తుంది... ఇది స్వానుభవంతో చెబుతూన్న మాట.

* * *

*ప్రపంచంలో చాలా దేశాల ఆర్థికస్థితినీ ప్రభుత్వాలనూ తన గుప్పిట్లో పెట్టుకుంది సారా... అందుకే కేవలం ప్రభుత్వ నిషేధాల వల్ల వ్యసనాలు మాయంకావు..*

* * *

*'షరాబ్ చీజ్ హి ఏసీ హై, న ఛోడీ జాయే' అని పంకజ్ ఉదాస్ గొంతుతో విన్నా... 'మజా లేనాహై పీనేకాతో కమ్ కమ్, ధీరె ధీరె పీ' అని వందనా వాజపేయి మధుర స్వరంతో విన్నా లేదూ...*

*పక్కన హుక్కా, చేతిలో ప్యాలా, చెంతనే మీననేత్రాల్తో మధువు పోసే సాఖీ బొమ్మా... అక్షరం అక్షరం మధువులో తడిసిన గజళ్లూ, రుబాయత్‌లూ ఊహూఁ తాగడం అన్నది వ్యసనంగా మారిం తర్వాత' అంత సౌందర్యవంతం కానేకాదు, కానేకాదు...●*